

# నెలకే.. నియామకమా?!

- అసంబద్ధంగా అతిథి అధ్యాపకుల క్రమబద్ధీకరణ
- నెల రోజుల వరకే నియామకంపై అనిశ్చితి
- ఆ తర్వాత పరిస్థితి ఏమిటని ఆవేదన
- నియామకాల్లో స్పష్టత లేక అయోమయం
- 370 జీవోతో ఇప్పటికే తీవ్రంగా అన్యాయం
- 'విత్ ఇన్ ది డిస్ట్రిక్ట్' ఆంక్షతో గల్లంతైన ఉద్యోగాలు
- నష్టపోతున్న విద్యార్థులు.. గాడితప్పుతున్న ఇంటర్ విద్య

హనుమకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్స్) పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సాధారణంగా కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లను ఒక విద్యాసంవత్సరం మొత్తానికి దృష్టిలో పెట్టుకొని నియమిస్తారు. ఆదేంటోగానీ.. గెస్ట్ లెక్చరర్ల నియామకం విషయంలో ప్రభుత్వం విచిత్రమైన పద్ధతిని అనుసరించింది. కేవలం ఒక నెల రోజుల వరకే రెన్యూవల్ చేసింది. ఇదేమిటంటే ఇంటర్ బోర్డు అధికారుల వద్ద సమాధానం లేదు. నెల రోజుల తర్వాత అయినా వీరి కాలపరిమితిని పొడిగిస్తారా..? అంటే కూడా స్పష్టతా లేదు. నెల రోజులు గడిచిన తర్వాత తాము కొనసాగుతామా? లేదా? అన్న ఆందోళనలో గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. వీరు ప్రస్తుతం త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు.

**పదేళ్లుగా..**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏళ్లుగా నియామకాలు లేకపోవడం వల్ల అధ్యాపకుల కొరత తీవ్రంగా ఏర్పడగా, ఈ సమస్యను అధిగమించేందుకు గెస్ట్ లెక్చరర్లను తీసుకున్నారు. విద్యార్థులకు సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయడంలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడంలో, అలాగే విద్యార్థుల ప్రవేశాలను పెంచడంలో పదేళ్లుగా వీరు కీలక భూమిక పోషిస్తున్నారు. అయితే ప్రతీ విద్యా సంవత్సరం వీరు రెన్యూవల్ కావలసి ఉంటుంది. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి వారిని విధుల్లోకి తీసుకుంటే సకాలంలో సిలబస్ పూర్తికావడంతో పాటు కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదు. తమను విధుల్లోకి తిరిగి తీసుకోవాలని అతిథి అధ్యాపకులు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో దిగి వచ్చిన ప్రభుత్వం.. ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే కొనసాగిస్తూ నెల రోజుల కాలపరిమితితో నియమకాలు చేసింది. ఈ మేరకు గత నెల 27న ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నిర్ణయం అధ్యాపకులను దిగ్భ్రాంతికి లోను చేసింది.

**రెగ్యులర్ దెబ్బ**

ఈనెల 5వ వేదీ నుంచి జరుగనున్న రెగ్యులర్ అధ్యాపకుల బదిలీలతో గెస్ట్ లెక్చరర్లు మరో సారి నష్టపోయే పరిస్థితి ఏర్పడనున్నది. ఈ విద్యా సంవత్సరం గెస్ట్ లెక్చరర్లను నెల రోజుల వరకే తీసుకోవడానికి కారణం త్వరలో జరగనున్న లెక్చరర్, జూనియర్ లెక్చరర్ల భర్తీ అయి ఉండొచ్చని భావిస్తున్నారు. కిందటేడు 1,392 లెక్చరర్లు, జూనియర్ లెక్చర్ల పోస్టులకు జరిగిన పరీక్షల దృష్ట్యా త్వరలో చేపట్టనున్న ఈ పోస్టుల భర్తీ దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చని భావిస్తున్నారు. రెగ్యులర్ లెక్చరర్ల బదిలీలు జరిగితే వారంతా గెస్ట్ లెక్చరర్ల స్థానంలోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో వీరి ఖాళీలు గల్లంతవుతాయి. ఒక వేళ ఈ విద్యాసంవత్సరం వీరి పునర్నియామకం జరిగిన పక్షంలో వేరే వేరే చోటికి వెళ్లాల్సి వస్తుంది.

**370 జీవోతో అన్యాయం**

గెస్ట్ లెక్చరర్లకు 370 జీవో గొడ్డలిపెట్టుగా మారింది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఈ జీవో వల్ల వీరికి ఎక్కువ నష్టం జరిగింది. వాస్తవంగా గెస్ట్ లెక్చరర్ మల్టీజోనల్ పోస్టుగా పరిగణించాలి. కనీసం జోనల్ పోస్టుగానైనా గుర్తించాల్సి ఉంది. కానీ గత విద్యా సంవత్సరం ఈ పోస్టును జిల్లా పరిధి (విత్ ఇన్ ది డిస్ట్రిక్ట్)కే పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రెగ్యులర్ అధ్యాపకులు గెస్ట్ లెక్చరర్ల స్థానంలో బదిలీపై రావడంతో వారు వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనితో చాలామంది అతిథి అధ్యాపకులు ఉద్యోగాలు పోయి నష్టపోవలసి వచ్చింది. ఇలాంటి వారిని కూడా కనీసం ఈ విద్యా సంవత్సరంలో తిరిగి తీసుకోలేదు. దీంతో పాటు ఒకేషనల్ కోర్సుల్లో సెకండ్ పోస్టుల్లో కూడా నియమకాలు చేయలేదు. అయితే జోన్ 1లో మాత్రం ఒకేషనల్ కోర్సుల్లో సెకండ్ పోస్టుల్లో నియామకాలు జరిపిన ప్రభుత్వం.. జోన్ 2లో మాత్రం జరపలేదు. అలా గత విద్యా సంవత్సరంలో గెస్ట్ లెక్చరర్లలో చాలా మంది కొనసాగింపు లేక రోడ్డున పడ్డారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇదే పరిస్థితి పునరావృతమయ్యేట్టు కనిపిస్తోంది.

**వృత్తికోర్సులకు అధ్యాపకుల కొరత**

జూనియర్ కాలేజీల్లో వృత్తి శిక్షణా కోర్సుల్లో విద్యాబోధనకు ఇద్దరేసి లెక్చరర్లు ఉండాలి. మొదటి సంవత్సరానికి ఒకరు, రెండో సంవత్సరానికి మరొకరు ఇన్‌చార్జిగా ఉండాలి. ఒకేషనల్ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మూడు థియరీ, మూడు ప్రాక్టికల్స్‌తో పాటు ఇంగ్లీష్, జనరల్ సైన్స్ ఉంటాయి. కిందటేడు అన్ని కాలేజీల్లో ఒక్క గెస్ట్ లెక్చరర్‌తోనే సరిపెట్టారు. రెండో గెస్ట్ లెక్చరర్ పునర్నియమకానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో విద్యార్థులకు బోధన సరిగా జరగక చాలా మంది ఫెయిల్ అయ్యారు. ఈ యేడు ఇప్పటివరకు ఆ ఒక్కరిని కూడా తీసుకోలేదు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకేషనల్ కోర్సులున్న జూనియర్ కాలేజీలకు లెక్చరర్లు లేకపోవడంవల్ల వారు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం గెస్ట్ లెక్చరర్లనన్నా కొనసాగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఒకేషనల్ కోర్సులు నడుస్తున్న జూనియర్ కాలేజీలు పదిహేనుకు పైగా ఉన్నాయి. ఇందులో 20కిపైగా వృత్తి కోర్సులను బోధిస్తారు.

**వెట్టి చాకిరి**

రాష్ట్ర వ్యాప్తంగా 1,654 మంది గెస్ట్ లెక్చరర్లు ఉండగా, ఉమ్మడి జిల్లాలో 158 మంది వరకు ఉన్నారు. వీరంతా ఏళ్ల తరబడి పని చేస్తున్నారు. హనుమకొండ జిల్లాలో 9, వరంగల్ జిల్లాలో 10, జనగామ జిల్లాలో 8, మహబూబాబాద్ 6, ములుగు జిల్లాలో 4, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 4 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. గెస్ట్ లెక్చరర్లకు ఇచ్చే వేతనం కూడా తక్కువే. వారికి ప్రస్తుతం నెలకు రూ.28,080 చెల్లిస్తున్నారు. వీరు నెలకు 72 పీరియడ్లు బోధించాలి. పీరియడ్‌కు రూ.390చొప్పున చెల్లిస్తారు. ఒకనెలలో 120 పీరియడ్లు బోధించినా.. 72 పీరియడ్లకే చెల్లిస్తారు. అయితే గెస్ట్ లెక్చరర్లు 72 పీరియేడ్లకే పరిమితం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు, వారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నెలలో 100 నుంచి 120 పీరియడ్ల వరకు బోధిస్తారు. అతిథి అధ్యాపకుల విధానం 2013 నుంచి అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి పని చేస్తున్నా వీరి వేతనం గొర్రెతోక బెత్తడే చందంగా ఉంది. రెగ్యులర్ లెక్చరర్లకు వేతనాలు రూ.లక్షన్నరకు పైగా ఉన్నా గెస్ట్ లెక్చరర్లకు మాత్రం చెల్లించేది మాత్రం అంతంత మాత్రమే.

---

# భూ వివాదంలో.. ఎస్సై చేతివాటం..?



- ప్రత్యేక విభాగం రహస్య విచారణ

మహబూబాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అన్నదమ్ముల భూవివాదంలో జిల్లాలోని ఓ ఎస్సై కేసును పక్కదారి పట్టించేందుకు ఒకరిని నుంచి కొంత నగదును తీసుకున్నట్లు పోలీస్ వర్గాల్లో ప్రచారం కలకలంరేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి సదరు పోలీస్‌స్టేషన్‌లో వారంరోజుల క్రిందట ఫిర్యాదు చేసినప్పటికి ఎదుటి వ్యక్తిపై కేసు నమోదు చేయడంలో జరిగిన తాత్సారం వెనుక ఏం జరిగిందన్న అంశంపై కూడా చర్చ కొనసాగుతోంది. బాధిత వర్గాల నుంచి ఫిర్యాదు అందినప్పటికి ఎదుటి వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలోనే సంబంధిత ఎస్సై ఎంతో కొంత పైకాన్ని తీసుకోవడం వల్లే ఇంకా ఆ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఆ.. నోటా.. ఈ నోటా ఎస్సై వ్యవహర తీరు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. గతంలో కూడా ఈ ఎస్సైపై పలు ఆరోపణలు ఉండడంతో సబ్ డివిజనల్ అధికారి స్పందించి వివరణ కోరినట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసుకు సంబంధించి తాను అక్కడికి వెళ్లలేదని, ఇతర ఉద్యోగులు వెళ్లారని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక విభాగం పోలీసులు రహస్యంగా విచారణ చేపడుతున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి మహబూబాబాద్ జిల్లాలోని పోలీస్‌శాఖలో ఇది ప్రస్తుతానికి చర్చనీయాంశంగా మారింది.

---



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పక్కా ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం సీజనల్ వ్యాధులు (మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్) ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య, ఆరోగ్య, మునిసిపల్, పంచాయతీరాజ్‌శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్‌వ్యాధులు ప్రబలే ఆవకాశం ఉన్నందున వైద్యఆరోగ్య, మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామాల్లో శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని, వసతిగృహాలు,పాఠశాలలు, పబ్లిక్‌ప్రదేశాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వసతులు కల్పించి, ఔషధ నిల్వలను సరిపడ అందుబాటులో ఉండే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టి, ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జిల్లా వైద్యాధికారి కళావతిబాయి, డీపీవో హరిప్రసాద్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష పాల్గొన్నారు.

---



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

- అపరిచితులు పంపిన లింక్‌లను మొబైల్‌లో ఓపెన్ చేయొద్దు
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

మహబూబాబాద్ రూరల్, జూలై 6 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ సూచించారు. మహబూబాబాద్ జిల్లాపోలీస్ కార్యాలయంలో 'సైబర్ హైజీన్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీగా ఉండే ప్రదేశాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, స్కూల్‌లు, కళాశాలల వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలమీద అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సోషల్ మీడియా ఖాతాలో డేటా గోప్యత, సెట్టింగ్స్ ఉపయోగించినవాటిని ప్రైవేట్‌గా ఉంచుకోవాలన్నారు. ఉపయోగంలో లేనప్పుడు మీ కంప్యూటర్, మొబైల్ ఫోన్‌ను లాక్ చేయాలని సూచించారు. అపరిచితులు పంపిన లింక్‌లను మొబైల్‌లో ఓపెన్ చేయొద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులకు మీ బ్యాంకు కార్డు, సీవీవీతో సహా మీ వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, డేబిట్, క్రెడిట్ కార్డు సమాచారం చెప్పకూడదన్నారు. నమ్మదగని సమాచారం వచ్చినప్పుడు మెయిల్స్‌ను ఓపెన్ చేయకూడదన్నారు. ప్రజలు ఎవరూ సైబర్ నేరాల బారిన పడకుండా

మిగతా 8వ పేజీలో..

---

# హామీలను నెరవేర్చకుంటే ఉద్యమాలే..

- జిల్లాలో ఖనిజ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- సీపీఎం కేంద్రం కమిటీ సభ్యుడు జి.నాగయ్య
- ముగిసిన రాజకీయ శిక్షణ తరగతులు



విలేకరులతో మాట్లాడుతున్న జి.నాగయ్య

కేసముద్రం, జూలై 6 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే.. వాటి అమలు కోసం ఉద్యమాలు చేస్తామని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు జి.నాగయ్య హెచ్చరించారు. కేసముద్రం హరిహర గార్డెన్స్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న పార్టీ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. చివరిరోజు తరగతుల్లో పార్టీ నిర్మాణంపై శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఏర్పడిన పొరుగు రాష్ట్రంలో పింఛన్లు పెంచడమేకాకుండా మూడు నెలల బకాయిలను కూడా చెల్లించారని, ఇక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఆసరా పింఛన్లు పెంచడంలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. విభజన హామీలైన బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు కోసం కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. జిల్లాలో బ్లాక్ గ్రానైట్ నిల్వలు, ఇనుప ఖనిజం భారీగా ఉన్నాయని, ఈ ఉత్పత్తులకు అనుబంధ పరిశ్ర మలు ఇక్కడ ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. రాష్ట్రంలో ఎనిమిది లక్షల ఎకరాల పోడుభూములు ఉండగా అరకొరగా పట్టాలి చ్చారని, మిగతా రైతులందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న, మార్తినేని పాపారావు, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, అల్వాల వీరయ్య, మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు, చాగంటి కిషన్, జల్లె జయరాజ్ పాల్గొన్నారు.

---

# ఎరువుల అక్రమ విక్రయంపై విచారణ

- సేల్స్ ఇన్‌చార్జ్ తొలగింపు
- షాపుపై 6ఏ కేసు నమోదు



సొసైటీ నుంచి అక్రమంగా దిగుమతి చేసిన యూరియా బస్తాలను సీజ్ చేస్తున్న అధికారులు

కేసముద్రం, జూలై 6 : కేసముద్రంలోని ధన్నసరి సొసైటీ నుంచి అక్రమంగా రాయితీ ఎరువుల విక్రయంపై శనివారం మండల వ్యవసాయాధికారి బి. వెంకన్న, జిల్లా సహకారఅసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.ప్రవీణ్‌కుమార్ విచారణ జరిపారు. సొసైటీలోని ఎరువుల విక్రయ కేంద్రం నుంచి రాయితీపై వచ్చిన ఆర్ఎఫ్‌సీఎల్ కంపెనీకి చెందిన 45 బస్తాలు ఎరువులను సేల్స్ ఇన్‌చార్జ్ ఇనుగాల సుదీష్ విక్రయించగా, వాంకుడోత్ బిక్నా ఆటోలో స్థానిక వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌కు తరలిం చినట్లు అధికారులు నిర్ధారించారు. ఇందులోని 25 బస్తాలను ఆ ఫర్టిలైజర్స్ వ్యాపారి మడూరి దినేష్ ముగ్గురు రైతులకు విక్రయించగా మిగతా 20 బస్తాలను సీజ్‌చేసి పొరుగునే ఉన్న రుషి ఫర్టిలైజర్స్‌లో షాపులో భద్రపర్చినట్లు ఏవో తెలిపారు. ఎరువుల చట్టం ప్రకారం షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కేసుపై జాయింట్ కలెక్టర్ చర్యలు తీసుకుంటారని, అక్రమంగా ఎరువుల ఖరీదు, విక్రయంపై షాపు లైసెన్సు విషయంలో వ్యవసాయ శాఖ ఏడీఏ చర్యలు చేపడుతారని ఏవో పేర్కొన్నారు. ఈ విషయంలో సొసైటీ సేల్స్ ఇన్‌చార్జ్ సుదీష్‌ను బాధ్యున్ని చేస్తూ పాలకమండలి ఆదేశాల మేరకు అతన్ని శాశ్వతంగా విధుల్లోంచి తొలగించి నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా కొద్దిరోజులుగా ఈ సొసైటీ నుంచి ఎరువులను అక్రమంగా వివిధ పట్టణ, గ్రామాల్లోని ఎరువుల షాపులకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

---



సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

# రుణాల రికవరీ చేయండి

- డిపాజిట్లపై విస్తృత ప్రచారం జరగాలి
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 6 : పెండింగ్‌లో ఉన్న రుణాలను త్వరగా రికవరీ చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు మేనేజర్లను ఆదేశించారు. సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ కర్షకమిత్ర, ఎల్‌టీ, డెయిరీ, మార్టిగేజ్ తదితర రుణాలను రికవరీ చేయాలన్నారు. రికవరీ కాని రుణాల విషయంలో చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. రుణాలు పొందేవారి చేత రూ. 2 లక్షల పీఎంజేజేవై, పీఎంఎస్‌బీవై చేయించాలన్నారు. బ్యాంకు డిపాజిట్ల పెరుగుదలపై దృష్టి పెట్టాలని ఈ మేరకు బ్యాంకు కల్పిస్తున్న వడ్డీలు ఇతర ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు సీఈవో వజీర్‌సుల్తాన్, జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎం మధుసూదన్ పాల్గొన్నారు.



---

# ఊపిరి తీస్తున్న గుంతలు

- ఖమ్మం-వరంగల్ 563 హైవేపై తరుచూ రోడ్డు ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు, ప్రజలు
- నివారణకు చర్యలు చేపట్టని ఎన్‌హెచ్ అధికారులు




ప్రమాద స్థలంలో రోడ్డుపై తొలగించిన రోడ్డుపై భాగం

దంతాలపల్లి, జూలై 6 : రోడ్లపై ఏర్పడిన గుంతలు ఊపిరి తీస్తున్నాయి. రహదారి మీదకు వచ్చిందంటే.. ఇంటి ప్రణాలతో వెళ్తామనే గ్యారంటీ లేకుండా చేస్తున్నాయి. ఖమ్మం-వరంగల్ 563 జాతీయ రహదారిపై దంతాలపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రాత్రి ఘోర రోడ్డు ప్రమాదానికి రహదారిపై ఏర్పడిన భారీ గుంతలే ప్రధాన కారణంగా తెలుస్తోంది.

నిత్యం రద్దీగా ఉండే ఈ హైవేపై వరంగల్ నుంచి మొదలు కొని ఖమ్మం వరకు రోడ్డుపై భారీ గుంతలు, కొన్నిచోట్ల మరమ్మతులకు జేసీబీలతో లేయర్ (రోడ్డు పైపొర భాగం-రోడ్డు సైడింగ్)ను తొలగించి మరచిపోయారు. ఎప్పుడూ గ్రానైట్ లారీలు వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్లడంతో గుంతలు ఏర్పడ డానికి ప్రధాన కారణంగా ప్రజలు భావిస్తున్నారు. దీంతో వరంగల్ నుంచి ఖమ్మం వైపువెళ్లే వాహ నదారులు (ఎన్‌హెచ్ రోడ్డు) ఎడమవైపు ప్రయాణానికి బదులు గుంతలున్న ప్రదేశాల్లో కుడి వైపునకు వెళ్లి మృత్యువాత పడుతున్నారు. నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నెలలో ఒకటి, రెండు చోట్ల వాహనాలు ఢీకొని తీవ్ర గాయాలపాలవుతున్నా యి. మే మొదటి వారంలో ఓ బైకిస్టు మండలకేంద్రం శివారులో గుంతను తప్పించపోయి మృతి చెందాడు. ఆ ఘటన మరవకముందే శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో తొర్రూరు మండలం వెలికట్టకు చెందిన బందు మల్లేష్, దంతాలపల్లి మండలానికి చెందిన పగిండ్ల కొమురయ్య, వాల్య తండాకు చెందిన భూక్య నరేష్ ఎదురెదురుగా ఆటో, కారు ఢీకొని ఆటోలో ప్రయాణిస్తుండగా మృతి చెందారు.

**చోద్యం చూస్తున్న ఎన్‌హెచ్ అధికారులు..**

వరంగల్-ఖమ్మం 563 జాతీయ రహ దారిపై ఏర్పడ్డ భారీ గుంతలు, రిపేరు కోసం రోడ్డు పైభాగాన్ని (లేయర్) తొలగించి, వదిలి వేశారు. నిత్యం రద్దీగా ఉండే హైవేపై ఉన్నతాధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దంతాలపల్లి మండలంలోని బొడ్లాడ క్రాస్‌రోడ్డు వద్ద రహదారిపై భారీ గుంతలు ఉండడంతో నర్సిం హులపేట మండలానికి చెందిన ఇద్దరు తండ్రికుమారులు మృతి చెందారు. ఇదంతా జరుగుతున్నా ఎన్‌హెచ్ అధికారులు మాత్రం నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు దృష్టి సారించి, రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చడంతో పాటు, ప్రమాదాలు జరుగుకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**భారీ గుంతలు పడిన చోట బోర్డులు కరువు**

జాతీయ రహదారిపై ఎక్కడ చూసినా 'మూల మలుపు ఉన్నది-నెమ్మది వెళ్లుము' అనే సూచిక బోర్డు కానరాదు. రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటులో ఎన్‌హెచ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రామ్‌నాథ్ కేకన్

**సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్పీ**

దంతాలపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి హైవేపై చోటు చేసుకున్న ఘోర రోడ్డుప్రమాద స్థలాన్ని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ సందర్శించారు. రహదారిపై ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

**గ్రానైట్ లారీలతోనే రోడ్లపై గుంతలు**

**- నవీన్, దంతాలపల్లి గ్రామస్థుడు**



వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై నిత్యం గ్రానైట్ లారీలు వెళ్లడంతోనే రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయి. రోడ్డుపై గుంతలను పూడ్చడంలో ఎన్‌హెచ్ అధికారులు నిర్లక్ష్యం. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

# విద్యుత్ కార్యాలయాల్లో కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లు

## టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 6: వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు ఎస్ఈ కార్యాలయం నుంచి మొదలు సెక్షన్ ఆఫీసుల వరకు కన్స్యూమర్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలతో సీఎండీ శుక్రవారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. రిసెప్షన్ డెస్క్‌ల ద్వారా ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయడానికి వీలుంటుందని, ఫిర్యాదులను విశ్లేషణ చేసుకోవచ్చన్నారు. ఒక వేళ ఫిర్యాదుపై వినియోగదారుడు సంతృప్తి చెందకపోతే ఫిర్యాదు పునరావృతం అవుతుందన్నారు. ఫిర్యాదులను సంబంధిత ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు పర్యవేక్షిస్తారన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో మొట్టమొదటిసారిగా విద్యుత్ బిల్లుపై క్యూఆర్ కోడ్ ముద్రించి వచ్చే నెల నుంచి అందిస్తామన్నారు. ఇప్పటికే వరంగల్ సర్కిల్ పరిధిలో మట్టెవాడ సెక్షన్, హనుమకొండ, భూపాలపల్లి, ఏజే మిల్స్, ఈఆర్‌ఓలలో ముద్రించి ఇస్తున్నట్లు తెలిపారు. ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని అధికారులకు సూచించారు. ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్, అంతరాయాలు లేకుండా మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు అధికారి నుంచి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలన్నారు. విద్యుత్ సర్వీసుల మంజూరును ఆన్‌లైన్ ద్వారానే చేపట్టాలన్నారు. సబ్‌స్టేషన్‌ల నిర్వహణతో పాటు ఇతర అన్ని రకాల నిర్వహణను యాప్‌లో పొందుపర్చాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు రాజుచౌహాన్, తిరుమల్‌రావు, కె.ఎన్.గుట్ట, కె.కిషన్ జీఎంలు గౌతమ్‌రెడ్డి, దేవేందర్, కృష్ణమోహన్, మల్లిఖార్జున్, నాగప్రసాద్, శ్రీనువాస్, శేషారావు, డీఈ ఐటీ. అనిల్‌కుమార్, డీఈ శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ యూత్ నాయకుడిపై కేసు

వరంగల్ క్రైం, జూలై 6: ఒకరిపై దాడి కేసులో 55వ డివిజన్ టీఆర్ఎస్ యూత్ నాయకుడు జి.సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు కేయూ ఎస్ఐ సురేష్ తెలిపారు. స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ జంక్షన్ సమీపంలోని బెల్టుషాపు నిర్వాహకుడి వంశీపై సాయి దాడి చేసి కొట్టాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

# ఎంజీఎంలో ఒకే ఒక డెంటిస్టు

## వైద్యుల కొరతతో ఇబ్బంది పడుతున్న రోగులు ● నియమించాలని డిమాండ్




వరంగల్ మెడికల్, జూలై 6: ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎం ఆస్పత్రిలో దంత వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. వందల సంఖ్యలో రోగులు వస్తున్నా.. ఒకే ఒక్క దంత వైద్యుడు తన పరిధిలో సేవలందిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఆ వైద్యుడిపై అధిక భారం పడుతోంది. ఒకవేళ ఆయన సెలవు పెట్టాండంటే అంతే సంగతులు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే దంత రోగులు వెనుతిరగాల్సిందే.

### రెగ్యులర్ వైద్యుడికి ఫారిన్ సర్వీస్

ఈ విభాగంలో హెచ్ఓడీగా పని చేస్తున్న ప్రొఫెసర్ ఆరేళ్ల కిందట కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారిగా ఫారిన్ సర్వీస్‌లోకి వెళ్లారు. అప్పట్లో ఎంజీఎం అధికారులు కూడా ఉన్న ఒక్క ప్రొఫెసర్‌ను వదులుకునేందుకు ఎన్ఓసీ ఎందుకు ఇచ్చారో ఇంత వరకు ఎవరికీ అర్థం కావడం లేదు. మొత్తానికి సదరు వైద్యుడు ఫారిన్ సర్వీస్‌లో స్థిరపడిపోయాడు. ఇక మిగిలిన ఒకే ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ రెండేళ్ల కిందట అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై వెళ్లిపోయాడు. ఇక ఎంజీఎంలో దంత వైద్య విభాగం వైద్యులు లేని దుస్థితి నెలకొంది. దీంతో తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిపై ఓ వైద్యుడిని నియమించారు. ఆ వైద్యుడే రోజు 200 వరకు ఓపీ చూస్తూ విభాగాన్ని నెట్టుకొస్తున్నారు. ఒకవేళ ఆయన సెలవు పెడితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వెనుతిరిగిపోవాల్సిందే.

### ఎన్ఎంసీ ఆక్షేపణ

దంత వైద్య విభాగంలో రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు లేరని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆక్షేపణ వ్యక్తం చేస్తూ తాజాగా లేఖను పంపింది. దంత వైద్య విభాగంలో పీజీలు ఎస్ఆర్‌లు కూడా ఉండకపోవడంతో ఒకే ఒక వైద్యుడిపై భారం పడుతోందని ఎన్ఎంసీ అభ్యంతరాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం.



ఎంజీఎంలో దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

### దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో?

కాకతీయ మెడికల్ కళాశాల, ఎంజీఎం ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిపై విధులు నిర్వర్తించేందుకు ఒక అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తు స్వీకరించి నెలలు గడుస్తున్నా కనీసం పరిశీలనకు నోచుకోనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా కేఎంసీ అధికారులు పేద రోగుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

### సంఖ్యను పెంచాలి

పేదల ఆస్పత్రిలో దంత వైద్యం కోసం వస్తున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యుల సంఖ్యను పెంచాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత పెద్ద ఆస్పత్రిలో ఒకే ఒక వైద్యుడు ఉండటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్, డీఎంఈ, జిల్లా మంత్రులు స్పందించాలని రోగులు కోరుతున్నారు.

# రూ.100కోట్లతో పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

## పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కల్చరల్, జూలై 6: ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక క్షేత్రంగా వరంగల్‌లోని భద్రకాళి ఆలయాన్ని రూ.100కోట్లతో అభివృద్ధి చేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మాఢవీధులు, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.30కోట్ల నిధులు ఇవ్వగా, మరో రూ.70 కోట్లు నిధులు వెచ్చించి రూ.100 కోట్లతో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. వరంగల్ నగరాన్ని మెడికల్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కలెక్టర్ రెండు రోజుల్లో అమ్మవారి ఆలయాన్ని సందర్శించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్, ఎన్ఆర్ఐలు కంచనకుంట్ల శ్రీధర్‌రెడ్డి, కీర్తి, ప్రముఖ పారిశ్రామిక వేత్త బాసని విశ్వప్రసాద్ శోభ, ప్రముఖ వైద్యుడు పోతాని రాజేశ్వరప్రసాద్, డాక్టర్ లలితాదేవితో పాటు వ్యాపారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో శేషభారతి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు





# రోదనల నడుమ అంత్యక్రియలు పూర్తి

## దంతాలపల్లి రోడ్డు ప్రమాద మృతులకు పూర్తయిన దహనసంస్కారాలు

## కన్నీరుమున్నీరైన గ్రామస్థులు, బంధువులు.. విషమంగానే క్షతగాత్రులు

దంతాలపల్లి, జూలై 6: వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి దంతాలపల్లి మండలకేంద్రం శివారు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జరిగిన ఆటో - కారు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి దహన సంస్కారాలు శనివారం రాత్రి పూర్తయ్యాయి. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన పగిండ్ల కొమురయ్య, వాల్యతండాకు చెందిన భూక్య నరేష్‌తో పాటు తొర్రూరు మండలం వెలికట్టకు చెందిన ఆటోడ్రైవర్ బందు మల్లేష్‌కు వారి వారి గ్రామాల్లో బంధువుల రోదనల నడుమ అంత్యక్రియలు పూర్తయ్యాయి. కాగా, మృతుడు పగిండ్ల కొమురయ్యకు కూతురు హారతి తల కొరవి పెట్టింది. మృతుడు నరేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయా గ్రామాల్లో పలువురు మృతదేహాలను సందర్శించి సంతాపాన్ని ప్రకటించారు.



ఇంటి ఎదుట కొమరయ్య మృతదేహంను చూసి రోదిస్తున్న బంధువులు

### కారు సీజ్ - డ్రైవర్‌పై కేసు

దంతాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురిని బలిగొన్న కారును పోలీసులు శనివారం సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. దంతాలపల్లి మండలంలోని రామానుజపురానికి చెందిన బొడ్డు సురేందర్.. ఖమ్మం నుంచి వస్తూ.. దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ శివారులో తొర్రూరు నుంచి వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటోలో ఉన్న పగిండ్ల కొమురయ్య, భూక్య నరేష్, ఆటో డ్రైవర్ బందు మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కారణమైన బొడ్డు సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ వెల్లడించారు.

### విషమంగానే క్షతగాత్రులు

దంతాలపల్లి మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో గాయపడిన తల్లీకూతుళ్లు పగిండ్ల మంజుల, పగిండ్ల అంజలి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు ఎస్సై కరుణాకర్ పేర్కొన్నారు. బీరిశెట్టిగూడెంకు చెందిన మృతుడు పగిండ్ల కొమురయ్య, ఆయన సతీమణి పగిండ్ల మంజుల, కుమార్తె అంజలి, బావమరిది కుమార్తె అక్కన్నపల్లి అక్షయ మహబూబాబాద్ మండలం అమనగల్ నుంచి శుక్రవారం రాత్రి బీరిశెట్టిగూడెంకు ఆటోలో బయలు దేరారు. ఈ క్రమంలో దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందగా, మంజుల, అంజలి, అక్షయ తీవ్రగాయాల పాలయ్యారు. వీరిని వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంజుల, అంజలి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.

# డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, జూలై 6: కేయూ డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి శనివారం విడుదల చేశారు. వివిధ కోర్సుల్లో 46,139 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 23,114 మంది 50.10 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు.



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

## ట్రాఫిక్ స్తంభాలకు కేబుల్ వైర్లను తొలగించాలి..

వరంగల్ క్రైం, జులై 6: మూడు రోజుల్లో ట్రైసిటీ పరిధిలో ఉన్న ట్రాఫిక్ స్తంభాలకు ఉన్న కేబుల్ టీవీ, ఇంటర్నెట్ కేబుల్ వైర్లను తొలగించాలని పోలీస్ కమిషనరేట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైసిటీ పరిధిలో కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా, పాత సిగ్నల్స్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలన్నారు. మూడు రోజుల్లో తొలగించకుంటే మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తామని కమిషనరేట్ అధికారులు తెలిపారు.


## నేడు 'రణధీర సీతక్క' పుస్తక ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, జూలై 6: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క జీవన ప్రస్థానంపై ప్రముఖ రచయిత ఆస్నాల శ్రీనివాస్ రాసిన 'రణధీర సీతక్క' పుస్తకావిష్కరణ సభను ఈ నెల 7వ తేదీన జిల్లా పరిషత్ హాలులో నిర్వహిస్తున్నట్లు దొడ్డి కొముురయ్య ఫౌండేషన్ ప్రతినిధులు రాములు, బిల్లా మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, ఆ పోరాట అమరుల స్మరణలో పుస్తక సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ బుర్ర రమేశ్‌బాబు కీలకోపన్యాసం చేస్తారు. కవులు, కళాకారులు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ జంక్షన్, జూలై 6: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, మెరుగు హనుమారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్, ఆపై చదువులు చదివే బాలికలు ఈ నెల 25లోపు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు బాలికతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరైనా ఒకరు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. దరఖాస్తులను హనుమకొండ కనకదుర్గాకాలనీలోని రోడ్ నంబర్1లో గల హాస్టల్‌లో వార్డెన్ శోభారెడ్డికి అందించాలని కోరారు. ఇతర వివరాల కోసం 9676649811లో సంప్రదించాలని కోరారు.

# తనిఖీల్లో తకరారు!



- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనాలు స్టాండ్స్‌కు తరలింపు
- అధిక డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- స్టాండ్ నిర్వాహకులు, పోలీసులకు మధ్య ఒప్పందం

డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలను అరికట్టాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తనిఖీలు నిర్వహించాలని చెబుతుంటే.. కొంతమంది పోలీసు అధికారులు దాన్ని ఆసరాగా తీసుకొని డబ్బులు దండుకుంటున్నారు. ఆర్టీసీ స్కూటర్ పార్కింగ్, బస్టాండ్ చుట్టూరా ఉన్న పార్కింగ్ కేంద్రం నిర్వాహకులతో ముందే ఒప్పందం కుదుర్చుకుని వాహనదారుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. రోజుకిన్ని వాహనాలను పార్కింగ్ కేంద్రాలకు తరలించాలని లక్ష్యం పెట్టుకుని మరీ వాహనాలను స్కూటర్ స్టాండ్‌కు తరలిస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ క్రమంలో రాత్రి పూట మద్యంషాపులతో పాటు, నగర శివారు భీమారం, ఎర్రగట్టు గుట్ట ఏరియాలో వాహన తనిఖీలను చేపట్టి వాహనాలను స్వాధీనం చేసుకొని పార్కింగ్ కేంద్రాలకు తరలిస్తూ వాహనదారుల జేబులకు చిల్లులు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



హనుమకొండ టౌన్, జూలై 6 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారుల నుంచి పార్కింగ్ పేరిట ఆయా స్కూటర్ స్టాండ్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ వసూళ్లలో కొంత ట్రాఫిక్ పోలీసులకు ముడుతుందనే ఆరోపణలున్నాయి. స్టాండ్ నిర్వాహకులతో ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ దందా సాగుతుందనే విమర్శలున్నాయి. ముఖ్యంగా హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ దందా ఎక్కువగా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

### వాహనం పట్టుబడితే అంతే..

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారుడికి వాహనం ఇచ్చేది లేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతుంటారు. మత్తులో ఉన్న వ్యక్తికి వాహనం ఇచ్చి ప్రమాదాలను పెంచాలా..? అని ప్రశ్నిస్తుంటారు. అయితే వాహనదారుల వెంట వచ్చిన సంబంధీకులకు వాహనాలు ఎందుకు ఇవ్వరనే ప్రశ్నకు సమాధానాలు చెప్పరు. అయితే వాహనాలను నగరంలోని పార్కింగ్ కేంద్రాలకు తరలించి భారాన్ని మోపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరపరిచి తీర్పు వెల్లడించే వరకు ఆ వాహనం పార్కింగ్ కేంద్రాల్లోనే ఉంటుంది. ఈ లోపు నిర్వహకులు వారి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. బాధితులు కోర్టులో చెల్లించే జరిమానా కంటే పార్కింగ్‌కు చెల్లించే డబ్బులే తడిసి మోపడవుతున్నాయని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### సిబ్బంది ఇష్టారాజ్యం

హనుమకొండ ట్రాఫిక్‌లో పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే ఓ ఆర్ఎస్ఐ హోంగార్డులపై ఒత్తిడి తెస్తూ భారీ లోడుతో వచ్చే వాహనాలతో పాటు కొంత మంది వ్యాపారస్థుల దగ్గర వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ స్టేషన్ అధికారి మాత్రం చూసీచూడనట్లుగా ఉండడంతో ఆ ఆర్ఎస్ఐ ఆడిందే ఆటగా నడుస్తోందని సిబ్బంది చర్చించుకుంటున్నారు. సీపీ దృష్టిసారించి ట్రాఫిక్ పోలీసుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు వ్యాపారస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

### ప్రభుత్వ ఉద్యోగి చిక్కితే పండగే..

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ప్రభుత్వ ఉద్యోగి పట్టుబడితే ట్రాఫిక్ సిబ్బందికి పండపండినట్లే.. కేసులో ఇరుక్కుంటే ఉద్యోగం పోతుందనే బెదిరింపులకు పాల్పడి అందినకాడికి దండుకుంటున్నారని విమర్శలున్నాయి. అలాగే కొద్ది రోజులు కిందట ఒక వ్యక్తికి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేస్తే ఆల్కహాల్ పర్సంటేజీ రాలేదు. దీంతో బండి కాగితాలు చూపించాలని మరో మెలిక పెట్టగా వాహనదారుడు చూపించకపోవడంతో బండిని పార్కింగ్‌కు తరలించారు. 24 గంటల్లో రూ.250 చెల్లించి బాధితుడు తన వాహనాన్ని తెచ్చుకున్నాడు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నెల రోజులకు ముందు ఓ వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా పోలీసులు రైల్వే స్కూటర్ స్టాండ్‌కు వాహనాన్ని తరలించారు. ఆ వ్యక్తి 20 రోజుల తర్వాత వాహనం కోసం వెళ్లగా వేలల్లో డబ్బులు అడగగా వాహనాన్ని అక్కడే వదిలేసినట్లుగా సమాచారం.

## బైక్ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నీలమ్మ

కొత్తగూడ, జూలై 6: రోడ్డుపై వెళుతున్న వృద్ధురాలిని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలప్రకారం.. కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన వెలుదండి నీలమ్మ రోడ్డుపై నడుస్తుండగా వెనకాల నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి బలంగా ఢీకొట్టాడు. దీంతో నీలమ్మ కుడి కాలు విరిగింది. తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అదించగా, హనుమకొండలోని ప్రయివేటు ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబీకులు తెలిపారు.

## ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 6: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు http://iti.telangana.gov.in అనే వెబ్ పోర్టల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థినికి ధృవపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ బి. ప్రభాకర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 6: ఎప్‌సెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల, కేడీసీ, కేయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ హెల్ప్‌లైన కేంద్రాల్లో ఎప్‌సేట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించి సంబంధించిన ధృవపత్రాలను విద్యార్థులకు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయగా, ఆర్ట్స్ కళాశాల సెంటర్‌లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జోతి విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు.

## గుట్కా పట్టుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, జులై 6: వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలో రూ.33వేల విలువ కలిగిన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రంలో కె.సురేష్ అనే వ్యక్తి నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి గుట్కా స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారుడిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించారు. ఈ విషయాన్ని సీఐ రవికుమార్ ధ్రువీకరించారు.



# వెహికిల్ షెడ్డులో రచ్చ.. రచ్చ..

**మెకానిల్‌కు, సూపర్‌వైజర్‌కు మధ్య గొడవ ● అధికారులకు ఇరువర్గాల ఫిర్యాదు**

వరంగల్ కార్పొరేషన్, జూలై 6: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధి బాలసముద్రంలోని బల్దియా వెహికిల్ షెడ్డులో జరిగిన గొడవ రచ్చకెక్కింది. శనివారం షెడ్డులో అక్కడి మెకానిక్‌లకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మధ్య జరిగిన గొడవ రచ్చరచ్చగా మారింది. షెడ్డులో పెద్దఎత్తున గొడవ జరగడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను సముదాయించారు. ఈ క్రమంలో కొంతసేపు మెకానిక్‌లు పనులు మానేసి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే..

బాలసముద్రంలోని బల్దియా వాహనాల మరమ్మతు కేంద్రంలో ముగ్గురు మెకానిక్‌లతో పాటు ఇద్దరు పంక్చర్లు అతికించే సిబ్బంది పనిచేస్తారు. అయితే ఇటీవల షెడ్డులో జరుగుతున్న దొంగతనాలపై అక్కడ పని చేసే సిబ్బందిని గుర్తించిన అధికారులు.. వారిని తొలగించి కొత్త వారికి అవకాశం ఇచ్చారు. అయితే బల్దియా కార్యాలయంలో ఆరోపణలు ఎదుర్కొన్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని బల్దియా షెడ్డులో నియమించారు. అందులో సదానందం అనే ఓవర్ స్టోరేజీ డ్రైవర్‌ను ఇక్కడ నియమించారు. ఈయన షెడ్డు ఇన్‌చార్జి అధికారులైన ఈఈ, డీఈల సహకారంతో షెడ్డు సూపర్‌వైజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. దీంతో సదానందం అక్కడ పని చేసే మెకానిక్‌లు, సహాయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందిపై అజామాయిషీ చెలాయిస్తున్నాడు. ఇది సహించలేని మున్నా అనే మెకానిక్ శనివారం తిరగబడ్డాడు. దీంతో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున గొడవ చోటు చేసుకుంది. ఒకరిని ఒకరు నెట్టి వేసుకున్నారు. అక్కడి సిబ్బంది కలుగ జేసుకుని సదానందం, మున్నాలను విడిపించారు. అక్కడి వారు వీరి గొడవను వీడియో తీసి వైరల్ చేశారు. ఇరువర్గాలు బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. బల్దియా షెడ్డులో జరిగిన గొడవపై అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు.



మాట్లాడుతున్న ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు

## విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

**ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు**

భీమారం, జూలై 6: విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.తిరుమల్‌రావు అన్నారు. హనుమకొండ భీమారంలోని ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం ఇండస్ట్రీ, ఇనిస్టిట్యూషన్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం డాక్టర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, ఫార్మసీ, బిజినెస్ మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరిశ్రమలోని నిపుణులతో మమేకమై వారి అనుభవంతో కెరీర్ పరంగా ముందుండాలని సూచించారు. ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే ఇలాంటి కార్యక్రమాలు తరుచూ నిర్వహిస్తాయని అయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. మల్టీనేషనల్ కంపెనీ అసోసియేట్ డైరెక్టర్ గణేష్ రమేశ్ ప్రొఫెషనల్ కెరీర్‌ల కోసం రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానం గురించి వివరించారు. వివిధ పారిశ్రామిక రంగాల్లో తాజా సాంకేతిక పరిణామాలపై కూడా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన డైరెక్టర్లు హరిప్రశాంత్, సూరజ్ శర్మ, ఆదిత్య కుమార్, నీరజా కేసరి, వైష్ణవి, ప్రముఖ కంపెనీల డైరెక్టర్లు, ఎండీలు పాల్గొన్నారు.

## ఫీటల్ మెడిసిన్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ శిరీషరెడ్డి

వరంగల్ మెడికల్, జూలై 6: అంజియో ఎంబోలైజేషన్ అనే పద్ధతి ద్వారా గర్భిణికి కోరియాంజియోమ అనే కణితికి రాష్ట్రంలోనే తొలిసారిగా చికిత్స అందించి తల్లి, బిడ్డ ప్రాణాలను కాపాడినట్లు హనుమకొండలోని ఫీటల్ మెడిసిన్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ శిరీషరెడ్డి తెలిపారు. ఈ తరహాలో చికిత్స భారత దేశంలో మూడోదని, రాష్ట్రంలోనే తొలిసారి హనుమకొండలో నిర్వహించినట్లు తెలిపారు. వరంగల్ రంగశాయిపేటకు చెందిన వేమునూరి హారిక 27 వారాల గర్భవతి. కడుపునొప్పితో గైనకాలజిస్టు డాక్టర్ వరలక్ష్మిని సంప్రదించిందని, అయితే స్కానింగ్ కోసం తమ వద్దకు పంపగా సుమారు 10 సెం.మీ. కణితి గర్భం దగ్గరలో ఉందని, దీనివల్ల గర్భంలో ఉన్న శిశువుకు రక్తం సరఫరా తగ్గడం, శిశువు గుండెపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్కానింగ్‌లో గుర్తించామన్నారు. గర్భిణీ ఇష్టం మేరకు కోరియాంజియోమా అనే కణితిని అంజియో ఎంబోలైజేషన్ అనే పద్ధతిలో అత్యంత సమర్థవంతంగా పనిచేసి ఈ నెల 5వ తేదీన ప్రసవం చేసినట్లు తెలిపారు. శిశువు 2.75 కేజీలతో ఆరోగ్యంగా ఉందని, ఈ తరహా చికిత్సను విజయవంతం పూర్తి చేసినట్లు డాక్టర్ శిరీషరెడ్డి వెల్లడించారు.

# భీమునిపాదంలో జల సవ్వడి

**పెరుగుతున్న పర్యాటకుల తాకిడి**
**కనువిందు చేస్తున్న జలపాతం**



గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 6 : గూడూరు మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ పరిధి అటవీప్రాంతంలో పచ్చని ప్రకృతినడుమ నిరంతరం జలధారతో ఆలరిస్తున్న భీమునిపాదం జలపాతం 70 అడుగులపై నుంచి జాలువారుతున్న వాటర్ పాల్స్‌ను చూసి పర్యాటకులు అబ్బురపోతున్నారు. శనివారం కురిసిన వర్షానికి భీమునిపాదంలో పర్యాటకుల సందడి పెరిగింది. రోజురోజుకు పర్యాటకుల సందడితో రద్దీగా మారుతుంది. ఆకాశంలో విరిసిన హరివిల్లు, మేఘాలను మోసుకువస్తున్నట్లు.. రాళ్లమీద నుంచి దూదిపింజెలు లోయలోకి దూకుతున్నట్లు 70 అడుగులపై నుంచి మంచు తెరలను తలపిస్తూ నీటి ధారాలు పడుతుంటే చూసే కన్నులకు ఎంతో హాయి... ఆకుపచ్చని ప్రకృతిలో గలగల పారే సెలయేరు ఒక్కసారిగా మాయమై గుట్టలమీది నుంచి కిందికి జాలువారుతుంటే మనస్సు పులకరిస్తుంది. ఈ రమణీయ దృశ్యాలకు నెలవు శోభలిల్లే సోయగాలులకు నెలవు భీమునిపాదం. ఈ వర్షకాలంలో పచ్చపచ్చని ప్రకృతిలో గలగల పారేటి సెలయేటి మధ్య సేద తీరుదాం రండి అంటూ భీమునిపాదం జలపాతం పిలుస్తోంది.

# ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

● జిల్లాలో 15 రోజులు సేవా కార్యక్రమాలు చేపట్టాలి

● బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

మహబూబాబాద్ రూరల్, జూలై6 : డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా 15రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్రక్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు పిలుపునిచ్చారు. మానుకోట జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. అనంతరం మొక్కలు నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై 6న శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముఖర్జీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1962లో భారతీయ జనసంఘ్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. భారతీయ జనసంఘ్‌కు దీపం గుర్తు కేటాయించారని, అప్పటి పార్లమెంట్ ఎన్నికల్లో 67 మంది ఎంపీలుగా పోటీచేస్తే కేవలం ఇద్దరే గెలుపొందారని చెప్పారు. జనసంఘ్ నుంచి బీజేపీ పార్టీగా అవిర్భవించిందని చెప్పారు. శ్యాంముఖర్జీ జయంతిని కేంద్రప్రభుత్వం పదిహేను రోజులు సేవా కార్యక్రమాలు చేపట్టాలనిపిలుపునిచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగా తొలి రోజు మొక్కలు నాటి నీరుపోసినట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, ముసుకు శ్రీనివాస్‌రెడ్డి,



మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

పెంటయ్య, దార ఇందుభారతి, నాగమణి, వెంకట్‌రెడ్డి, రామడుగు వెంకటాచారి, కొమ్మాల్‌రెడ్డి, పులేందర్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

### మానుకోటలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి..

●మహబూబాబాద్ టౌన్ : మహబూబాబాద్ పట్టణంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భారత మాజీ ఉపప్రధాని దివంగత బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానుకోట ఆర్డీవో అలివేలు మాట్లాడుతూ భారత ఉప ప్రధానిగా దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికిపాటు పడ్డ మహానీయులు బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పని చేశారని చెప్పారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన మహానీయులు బాబుజగ్జీవన్‌రామ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వివిధ సంఘాల నాయకులు తప్పెట్ల వీరన్న, సోమారపు వీరస్వామి, నీరుటి సామెలు, పాలబిందెల మల్లయ్య, ఇనుగుర్తి సుధాకర్, పొన్నాల యుగేందర్, దర్శనం రామకృష్ణ, మంగలంపల్లి కన్న, మంద శశికుమార్, డౌలగర్ శంకర్, అంబాల శివకుమార్, ఎఎస్ డబ్ల్యూవో పూర్ణచందర్ పాల్గొన్నారు.

### తొర్రూరులో..

● తొర్రూరు : తొర్రూరులో బాబుజగ్జీవన్‌రాం వర్ధంతి పురస్కరించుకుని పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సోమారపు ఐలయ్య, కిషన్‌నాయక్, బంధు వెంకన్న, రాయిశెట్టి వెంకన్న, ఉపేందర్, ఎండి.అమీర్, సంజీవ, బీకునాయక్, రమేష్ పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


గుంషావలి (ఫైల్)

గూడూరు, జూలై6 : మండలంలోని మర్రిమిట్టకు చెందిన ఎస్‌కె. గుంషావలి (50) శనివారం కుటుంబకలహాలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నగేష్ కథనం ప్రకారం. మర్రిమిట్టకు చెందిన గుంషావలి తనభార్య కైరుతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఏం పనిచేయకుండా ఖాళీగా ఉండడంతో తరుచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గత 15 రోజుల క్రితం కైరు తనభర్త గుంషావలితో గొడవపడి పుట్టింటికి వెళ్లి, తిరిగి ఇంటికి వచ్చింది. ఇంట్లో ఖాళీగా ఉండకుండా ఏదైనా పనిచేయాలని కైరు భర్తకు సూచించింది. దీంతో ఇద్దరి మధ్య మరోసారి ఘర్షణ చోటు చేసుకుంది. కైరును ఇంట్లో నుంచి బయటకు పంపించి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య కైరు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు షాజహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అనారోగ్యంతో మహిళ..


విజయ (ఫైల్)

సీరోలు : అనారోగ్య సమస్యలను తట్టుకోలేక మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కురవి మండలం సీరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజతండాలో శనివారం చోటుచేసుకుంది. సీరోలు ఎస్సై విజయ్‌రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. నల్లెల్ల శివారు గాజతండాకు చెందిన బానోత్ విజయ (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర మనోవేదన చెందుతోంది. తనవల్లే కుటుంబసభ్యులు బాధపడుతున్నారనే మనస్తాపం చెందిన ఆమె ఉదయం ఇంట్లోనే చీరతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. భర్త లాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### చికిత్స పొందుతూ ఒకరు..


సురేష్ (ఫైల్)

తొర్రూరు : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. చీకటాయపాలెం గ్రామానికి చెందిన సందెల సురేష్ (35) గత నెల 28న తొర్రూరు పట్టణ శివారులో లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి బావమరిది కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జిల్లాలో జీపీగా ఒకరు.. ఏజీపీగా ముగ్గురు నియామకం

● ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్, డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ అద్వైత్‌కుమార్‌సింగ్


జిల్లా కోర్టు జీపీగా నియామకమైన వెంకటస్వామి

మహబూబాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తొర్రూరు, మానుకోట కోర్టుల్లో ఒకరిని గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ)గా, ముగ్గురు అసిస్టెంట్ గవర్నమెం ట్‌ప్లీడర్ (ఏజీపీ)లుగా నియమిస్తూ శనివారం రాత్రి కలెక్టర్, డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఉత్వర్వులను జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా సీనియర్‌న్యాయవాది డి.వెంకటస్వామి, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్‌ప్లీడర్‌గా డి.సత్యనారాయణను, జూనియర్ సివిల్ జడ్జికోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్‌ప్లీడర్‌గా టి.సునీతను, తొర్రూరు కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా న్యాయవాది బండపల్లి వెంకన్నను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

(5వ పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్‌క్రైమ్ గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేయాలని సూచించారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ తిరుపతిరావు, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సీఐలు దేవేందర్, శరవయ్య, ఎస్సైలు గోపి, దీపికరెడ్డి పాల్గొన్నారు.

### మొక్కలు మానవాళికి జీవనాధారం

మొక్కలు మానవాళికి జీవనాధారమని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగామొక్కలు నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి, మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత పోలీస్ అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, సైబర్‌క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు పెండ్యాల దేవేందర్, శరవయ్య, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఆర్‌ఐలు భాస్కర్, సాంబశివరావు, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేస్తాం

● వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

గూడూరు, జూలై 6 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న ఆయాఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. గూడూరు సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం సందర్శించారు. వివిధ వార్డుల్లో తిరిగి రోగులను వైద్యం అందుతుందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1300 వైద్యుల పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. గూడూరు సామాజిక ఆరోగ్యకేంద్రానికి రానున్న రోజులు మంచి రోజులు వస్తాయన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉంటూ నాణమైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.వెంకట్రాములు, ఆర్‌ఎంవోలు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వైదేహి, సూపరిండెంట్ వీరన్న, డాక్టర్ ఎడ్ల రమేష్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ స్రవంతి ఉన్నారు.


గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్న అజయ్‌కుమార్

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జూలై6 : జిల్లా కేంద్రంలో పాతబజారులోని పలు కాలనీల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండ్లకుంట కాలనీ, నందినగర్, నర్సంపేట బైపాస్‌రోడ్డు, కేసముద్రం రోడ్ ఏరియాల్లో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### కురవిలో..

● కురవి : కురవిలోని 11 కేవీ ఫీడర్ నందు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శారద తెలిపారు. ఫీడర్ పరిధిలో చెట్లు కొట్టుట, కొమ్మలు తొలగించుట ఉన్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

మహబూబాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షలు చేసి, సదరం సర్టిఫికెట్ మంజూరు చేసేందుకు ఈనెల 7న మధ్యాహ్నం 12 గంటలకు మీసేవ సెంటర్లలో స్లాట్‌బుకింగ్ ప్రారంభమవుతాయని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవారి కోసం 300, రెన్యూవల్ కోసం 150 మంది మొత్తంగా 450 మందికి అవకాశం ఉందని చెప్పారు. శారీరక వైకల్యం, బుద్ధిమాంద్యం, కంటిచూపు లోపం, చెవిటి, మూగ లాంటిలోపం ఉన్నవారు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రామాలయంలో భక్తులకు అన్నదానం

మరిపెడ, జూలై 6 : మరిపెడ రామాలయంలో శనివారం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు సుదర్శన్ భట్టార్ రాములోరి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురష్కరించుకొని దేవతమూర్తులకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. గంట్లా రంగారెడ్డి, కాంతారావు, శ్రీనివాస్, వేణు, జానకీ రాములు పాల్గొన్నారు.

## ముగ్గురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జూలై 6 : వరకట్నం వేధింపుల కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి శనివారం తెలిపారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన కొమ్ము రాజేశ్వరిని రెండేళ్ల క్రితం కురవి మండలం రాజోలు గ్రామానికి చెందిన వేణుతో వివాహం జరిపించారు. వివాహ సమయంలో రాజేశ్వరి తల్లిదండ్రులు కట్న కానుకలు ఇచ్చి, వివాహం జరిపించారు. గత ఆర్నేళ్ల నుంచి అదనపు కట్నం తీసుకురావాలని కొమ్ము రాజేశ్వరిని భర్త వేణు, మామ నారాయణ, అత్త లాలమ్మ వేధింపులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 18 లీటర్ల గుడుంబా స్వాధీనం

● రెండు ద్విచక్రవాహనాలు సీజ్

గూడూరు, జూలై 6 : మండలంలోని బొద్దుగొండ గ్రామశివారులో ఎక్సైజ్ పోలీసులు శనివారం రూట్‌వాచ్ నిర్వహించారు. అటుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలను తనిఖీ చేయగా అందులో 18 లీటర్ల గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకుని, గుడుంబా తరలించేందుకు వినియోగించిన రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.బిక్షపతి తెలిపారు. వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌కుమార్, మహబూబాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ కిరణ్ ఆదేశాల మేరకు గుడుంబా స్థావరాలపై దాడులు ముమ్మరం చేసినట్లు చెప్పారు. సిబ్బంది సుధాకర్, దేవేందర్, నంద కిశోర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కేసముద్రం, జూలై 6 : మండలంలోని అన్నారం శివారు కిష్టాపురం తండాలో భూక్యా వీరన్నకు చెందిన దుక్కిటెద్దు శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. వీరన్న తన ఎద్దును చెల్కా వద్దకు తీసుకువచ్చి మేత కోసం వదిలిపెట్టాడు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు గడ్డి మేస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దువద్ద వీరన్న దంపతులు రోధిస్తుండడం పలువురిని కలిచి వేసింది. ఎద్దు విలువ రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాక్సిన్‌ను వేయించాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి


కృష్ణకాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శిస్తున్న కళావతిబాయి

నెహ్రూసెంటర్, జూలై 6 : పుట్టిన ప్రతీ బిడ్డకు, గర్భిణీకి ఔట్రీచ్ వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బికళావతిబాయి సూచించారు. జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీ సబ్‌సెంటర్, మంగలి కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, చిన్న పిల్లలకు ఔట్రీచ్ వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ప్రతి ఒక్కరికి వ్యాక్సినేషన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణీలకు మొదటి రెండుడోసులు ఆరు వారాల్లోపు ఇవ్వాలని, పదివారాల వరకు మరోకటి అలా పుట్టిన ప్రతి పిల్లలకు పది సంవత్సరాల వయస్సు వచ్చే వరకు మొత్తంగా 13 డోసులు వేయించాలని సూచించారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా వ్యాక్సినేషన్ వేయించుకునేలా ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, వొబిలిశెట్టి రామకృష్ణ, రత్నకుమారి, బబిత, లలిత, భానుమతి, లక్ష్మి, శారద, మహాలక్ష్మి పాల్గొన్నారు.

# పత్తిపాక ప్రధాన రోడ్డు దుస్థితిపై సీపీఐ నిరసన

మహబూబాబాద్ టౌన్, జూలై 6: మునిసిపల్ పరిధిలోని పత్తిపాక ప్రధానరోడ్డు దుస్థితిపై సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. రోడ్డు విస్తరణలో పనుల్లో భాగంగా తవ్వి వదిలేయడంలో నీళ్ల నిలిచిన గుంతల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ పత్తిపాక రోడ్డు విస్తరణ నిర్మాణపనులు మొదలై రెండేళ్లు దాటినా నేటికి పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తవ్వి వదిలేయడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తవ్విన గుంతల్లో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షం వస్తే బురదమయంగా మారి ప్రజలు నరకయాతన పడుతున్నారని పేర్కొన్నారు. పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, పురం భాగ్య, నక్క నాగార్జున, మంద శంకర్, దండ శ్రీనాథ్, తోట రమేష్, వికాస్, ఉపేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పత్తిపాక రోడ్డులో తవ్వి వదిలేసిన ప్రాంతంలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

## స్త్రీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

● పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగక్క



కంబాలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీవోడబ్ల్యూ సంఘం మహిళ నేతలు

మహబూబాబాద్ రూరల్, జూలై 6 : స్త్రీ, పురుష సమానత్వానికై, స్త్రీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని ప్రగతిశీల మహిళ సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగక్క అన్నారు. మహబూబాబాద్ మండల మహాసభ సందర్భంగా కంబాలపల్లిలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగక్క మాట్లాడుతూ స్త్రీలకు భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని చెప్పారు. దేశంలో ఎక్కడో ఒకచోట స్త్రీలపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు జరుగుతున్నాయని చెప్పారు. వాటిని నివారించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంద పద్మ, తిరుపతమ్మ, యాకుబి, సామ రజిత, కవిత, అనిత, కల్పన, ఎల్లమ్మ, కల్యాణి, వెంకటమ్మ, సామ పాపయ్య, ఎస్‌కె. బాబన్న పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

● మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 6 : అడవులు అంతరించిపోయి దెబ్బతింటున్న పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రధాన కూడళ్లలోని డివైడర్లలో నాటిన కోనోకార్పస్ చెట్ల తొలగింపు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గతంలో డివైడర్లలో నాటిన కోనోకార్పస్ మొక్కల ద్వారా వచ్చేగాలిని తీసుకోవడంతో ప్రజలకు శ్వాసకోశ ఇబ్బందులు తలెత్త ప్రమాదముందన్న నేపథ్యంలో వాటిని తొలగించి, ఆ స్థానంలో వేరే మొక్కలను నాటనున్నట్లు చెప్పారు. మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ క్రాంతి పాల్గొన్నారు.

## 9న మానుకోటలో జాబ్‌మేళా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 6 : కలెక్టర్ కార్యాలయం రెండో అంతస్తులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 9న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ శనివారం తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీలో లోన్ అధికారి ఉద్యోగ నియామకానికి ఖాళీగా ఉన్న 20 పోస్టులకు ఇంటర్ ఆపైన విద్యార్హత. బ్రాంచ్ మేనేజరు పోస్టులు 20కు గాను ఏదైనా డిగ్రీ లేదా పీజీ అర్హత కలిగి 18 నుంచి 28 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు జాబ్ మేళాలో విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 85200 55375ను సంప్రదించాలన్నారు.

## ఐటీఐలో ప్రవేశాల దరఖాస్తుకు గడువు పెంపు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 6 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శనివారం తెలిపారు. 14సంవత్సరాలు పూర్త యి పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు iti.telangana.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.మొదటి విడతలో దరఖాస్తు చేసుకొని సీటు రానటువంటి వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేదన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఒరిజినల్‌సర్టిఫికెట్లను స్కాన్‌చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల మెరిట్, రిజర్వేషన్, వెబ్‌ఆప్షన్‌ల ద్వారా సీట్ల భర్తీ ఉంటుందన్నారు.ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 'చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి'

నెహ్రూసెంటర్, జూలై 6 : మాదిగల రిజర్వేషన్, వర్గీకరణే లక్ష్యంగా ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ దండోరా రజితోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే సభకు మాదిగలు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ దండోరా జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం కాలనీలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పులి శ్రీను, దేవి ఉపేందర్, దేశబోయిన సతీష్, బాలకృష్ణ, సత్యప్రసాద్, సీహెచ్.రాధ, కుక్కల సుధ, సందీప్, కాగితాల జ్యోతి, పద్మ, శివరాత్రి నాగమణి, సమ్మక్క పాల్గొన్నారు.

## 'వనమహోత్సవంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలి'

డోర్నకల్, జూలై 6 : మండలంలో జరుగుతున్న వనమహోత్సవంలో లక్ష్యాన్ని చేరుకోవడానికి సిబ్బంది ప్రణాళికలు రూపొందించి పూర్తి చేయాలని జిల్లా జడ్పీ సీఈవో నర్మద అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శుల, ఉపాధిసిబ్బందితో వనమహోత్సవ కార్యక్రమంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 50 శాతం మేర వనమహోత్సవ కార్యక్రమం జరిగిందని, లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏంపీవో మున్వర్‌బేగ్, జీపీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## కురవిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

● పీహెచ్‌సీ, పాఠశాలల్లో తనిఖీలు

కురవి, జూలై 6 : మండలం కేంద్రంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. కురవిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఆయుర్వేద వైద్యశాలను అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య కేంద్రంలోని ఓపీని పెంచాలని, నిత్యం వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందిస్తూ ప్రైమరీ విద్యను వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక వివరాలను పరిశీలించి ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండ బడికి హాజరు కావాలన్నారు. ఆయా కార్యక్రమంలో డాక్టర్ విరాజిత, సహాయ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సత్యవతి, హెచ్‌ఎంలు వహిద్, ఉప్పలయ్య, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బొల్లు రమేష్



కొత్తగూడ, జూలై 6 : నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పెగడపల్లికి చెందిన బొల్లు రమేష్ నియామకం అయ్యారు. ఈసందర్భంగా బొల్లు రమేష్ మాట్లాడుతూ తన నియామంకు సహకరించిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కొత్తగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జ సారయ్య, ప్రజా ప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'రాంచంద్రునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి'

చిన్నగూడూరు, జూలై 6 : రాష్ట్ర క్యాబినెట్ విస్తరణలో భాగంగా డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు ఎస్టీ కోటాలో మంత్రి పదవి ఇవ్వాలని ఉగ్గంపల్లి సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు ఆంగోత్ జగన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఉగ్గంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. డోర్నకల్ నియోజకవర్గం పూర్తిగా వెనుకబడి ఉందని, ఆ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని గిరిజనుల అందరి తరుపున ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమ విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో లెనిన్, వెంకన్న, మల్లయ్య, ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.

## ఘనంగా జినోసిస్ డే

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 6 : జినోసిస్ డే సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జె.సుధాకర్ శనివారం కుక్కలకు యాంటి ర్యాబిస్ ఇంజక్షన్‌లు వేశారు. మహబూబాబాద్ ఏరియా పశువైద్యశాలలో కుక్కలకు ఇంజక్షన్‌లు వేసి జినోసిస్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో 164 కుక్కలకు యాంటి ర్యాబిస్ ఇంజక్షన్‌లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్నిపశువైద్యశాలలో ప్రతీ గురువారం ఉచితంగా ఈ యాంటి ర్యాబిస్ ఇంజక్షన్‌లు ఉచితంగా వేస్తామని, కుక్కలు పెంచుకునే యాజమానులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పెనుగొండ హైస్కూల్లో డీఈవో తనిఖీ

కేసముద్రం, జూలై 6 : పెనుగొండ జడ్పీహైస్కూల్‌ను శనివారం డీఈవో రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. ప్రతీ పాఠశాలలో గ్రేడింగ్‌పై అవగాహన కల్పిస్తూ చార్ట్‌లను తరగతిగదుల్లో, స్టాఫ్‌రూంలో ప్రదర్శించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. హెచ్‌ఎం కె.యాదగిరి, పీఎస్ హెచ్‌ఎం వెంకట్రాం నర్సయ్య, అంజయ్య, గురునాథరావు, హుస్సేన్, మల్లేషం, సత్యం, కిషన్, వెంకటగిరి, వీరేందర్ పాల్గొన్నారు.

## గోదాంలను పరిశీలించిన మార్కెట్ చైర్మన్

గూడూరు, జూలై 6 : గూడూరు పాకాల సమీపంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ గిడ్డంగులను శనివారం నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి పరిశీలించారు. గిడ్డంగుల్లో నెల కొన్న సమస్యలను మార్కెట్ కార్యదర్శి కృష్ణమీనాకుమార్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ గిడ్డంగుల సామార్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం నిల్వ ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధితఅధికారులను ఆదేశించారు. వారివెంట డైరెక్టర్‌లు సమ్మెట శ్రీనివాస్, సుమలత పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు విద్యార్థుల ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 6 : మహబూబాబాద్ జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 3, 5, 8వ తరగతులకు ఎంపికైన 152 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసినట్లు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎర్రయ్య తెలిపారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో శనివారం ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలు 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలు పొందేందుకు 639 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జూన్ 12న ఏటూరునాగారం ప్రాజెక్ట్ అధికారి సమక్షంలో కమిటీ సభ్యుల, గిరిజన విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో కేటగిరీ, తరగతుల వారీగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మానుకోట శివారు జమాండ్లపల్లి విద్యాభారతి స్కూల్ 3వ తరగతిలో 36, 5వ తరగతిలో 14, 8వ తరగతిలో 14 మంది మొత్తం 64 మంది, మరిపెడ అభ్యాస్ హైస్కూల్ 3వ తరగతిలో 20, 5వ తరగతిలో 01, 8వ తరగతిలో 12 మొత్తం 44 మంది, మరిపెడ పి.ఎస్.ఆర్ స్కూల్ 3వ తరగతిలో 20, 5వ తరగతిలో 12, 8వ తరగతిలో 12 మొత్తం 44 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

## 'మత్స్యకార్మికులను ఆదుకోవాలి'

మహబూబాబాద్ టౌన్, జూలై 6 : రాష్ట్రంలో మత్స్యకార్మికులను ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, ఆదుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్, జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రియాంక అలను శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకుని, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 10 ఎకరాల స్థలంలో మత్స్యకార భవన్, చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తూరు రమేష్, గుండా వెంకన్న, ఎదరబోయిన సూరయ్య, పిట్టల ధనుంజయ్య, దుండి వెంకటేశ్వర్లు, పాండవుల మల్లయ్య, గంధం చంద్రమూర్తి పాల్గొన్నారు.


రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక అలకు పుష్పగుచ్చం అందించి, శుభాకాంక్షలు తెలుపుతున్న ముదిరాజ్ మహాసభ నేతలు